క్లుప్తంగా

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మొవ్వ: భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎంతగానో ఉపయోగపడుతుందని, ఖరీఫ్ పంటకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లి కలియదున్నడం వలన భూమిలోని సారాన్ని పెంచవచ్చని మండల వ్యవసాయాధికారి కే శివప్రసాద్ తెలిపారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము, పిల్లిపెసర అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్సిడీ పోను జీలుగ, జనుము కిలో రూ.44, పిల్లిపెసర కిలో రూ.67కి అందిస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించాలని పేర్కొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

గుడివాడరూరల్: గ్రామాల్లో బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. నందివాడ మండలంలోని జనార్దనపురం శివారు నూతులపాడులో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎస్‌ఐ సోమవారం పర్యటించారు. గ్రామంలో రోడ్ పక్కనే బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

గురుకుల పాఠశాల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్


గుడివాడరూరల్: మోటూరు గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఉన్నత పాఠశాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న ఆరు సీట్లకు ప్రతిభ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ లత సోమవారం తెలిపారు. మిగిలిన ఉన్న బీసీ(సీ)–5, బీసీ–1 మొత్తం ఆరు సీట్లకు ప్రతిభ ఆదారంగా ఈ నెల 29వ తేదీన ఉదయం 9గంటల నుంచి ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల గురుకుల పాఠశాలనందు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ కోరారు.

వృద్ధులకు చీరల పంపిణీ



గుడివాడరూరల్: జన్మదినోత్సవాల పేరిట వృథా ఖర్చులు మానుకుని వృద్ధాశ్రమంలోని వారికి అన్నదానం, చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని శ్రీకృష్ణయాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కలవలపల్లి గ్రామానికి చెందిన తాతా సాయమురళీకృష్ణ, నాగలక్ష్మీల తనయుడు రేవంత్ సత్యశివరామ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతి వృద్ధాశ్రమం, మమతా వృద్ధాశ్రమం, కరుణాపీఠంలోని వృద్ధులకు అన్నదానం చేసి, చీరలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అడుసుమిల్లి వెంకటరత్నం(బాబాయ్), నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, యాదవ సంఘ మహిళ కార్యదర్శి కుంభం నాగమణి, కంతేటి హరిబాబు, జాజుల తాతారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదబాధితులకు ఆర్థిక సాయం



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు రాచూరి వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులు ముగ్గురికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు సోమవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందచేశారు. బాధితులు రాచూరి లంకేశ్వరావు కుమార్తె చదువుపట్ల ఉన్న ఆసక్తిని గమనించి పుస్తకాల కొనుగోలుకు మరికొంత నగదు అందించారు. భవిష్యత్‌లో చిన్నారి విద్యా అవసరాల నిమిత్తం పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ దిడ్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని బాబూరావు, చందన రంగారావు, కేసాని శివుడు, వర్రె బసవరావు, చంద్ర, శ్రీనివాసరావు, బుజ్జి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారానికి మేలు

- ఎకరా సాగు చేస్తే ఐదు టన్నుల ఎరువు ఉత్పత్తి
- రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాల పంపిణీ

గుడివాడరూరల్: భూమికి అధిక సారాన్ని అందించే జీలుగ(పచ్చిరొట్ట) విత్తనాలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు భూమిల్లో ఉన్న సారాన్ని పెంపొందించేందుకు జీలుగ సాగు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో జీలుగ సాగు చేస్తుండగా మరికొంతమంది రైతులు పొలాల్లో జీలుగ విత్తనాలను చల్లుతున్నారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా రైతులకు జీలుగ(పచ్చిరొట్ట) విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది వ్యవసాయశాఖ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను రైతులకు అందిస్తున్నారు.

భూమి సారవంతం

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. సేంద్రియ, రసాయన ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది. రసాయన ఎరువులతో భూసారం తగ్గి, పంట దిగుబడిపై ప్రభావం పడుతుండటంతో అప్రమత్తమైన అధికారులు నాలుగేళ్లుగా పచ్చిరొట్టలో భాగంగా జీలుగ సాగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రైతులకు అవగాహన కల్పించడంలో విజయవంతమయ్యారు. గుడివాడ నియోజకవర్గంలో ప్రస్తుతం జీలుగ, పిల్లిపెసరలు సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. వరి వెదసాగు చేసే రైతులు తక్కువగా వీటిపై ఆసక్తి చూపుతున్నారు. దమ్ము పట్టి వరినారు వేసే రైతులు పచ్చిరొట్ట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తున్నారు. రైతులు వరిసాగు చేసే నెల రోజుల ముందే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకోవాలి. ఎకరాకు 10 కిలోల పచ్చిరొట్ట విత్తనం అవసరం. నార్లు పోసే 10 రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మునిగి, భూసారం పెరుగుతుంది. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుంది. తుంగ, గరిక మొక్కలను నివారించగలుగుతుంది.



రామనపూడిలో సాగు చేసిన పచ్చిరొట్ట (ఫైల్)

కుళ్లిన తర్వాత నాట్లు

పచ్చిరొట్ట ఎరువు తేలికపాటి నేలల్లోనూ, నల్లరేగడి భూమిల్లోనూ సాగు చేసుకోవచ్చు. దీని నుంచి ఎకరాకు ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజుల మధ్య భూమిలో కలియదున్నితే మంచిది. ఇందులో ఎనిమిది కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్, 35 కిలోల నత్రజని ఉంటుంది. పిల్లి పెసర పచ్చిరొట్టుగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పచ్చిరొట్టను పొలంలో కలియదున్నితే కుళ్లిన తర్వాత నాట్లు వేసుకోవాలి.

సాగుకు రైతుల ఆసక్తి



గతంతో పోలిస్తే పచ్చిరొట్ట ఎరువు సాగుకు ప్రస్తుతం రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడంతో మరింతగా ఉపయోగపడుతుంది. మోటార్లు, చెరువుల ఆధారం ఉన్న రైతులు ఇప్పుడు ఈ విత్తనాలను సాగు చేసుకోవచ్చు. నీటి వసతి లేని వారు వర్షాలు పడిన తర్వాత వేసుకుంటే మంచిది. పచ్చిరొట్ట ఎరువుల సాగు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నాం. ఇప్పటికే జీలుగ 63 క్వింటాళ్లు, పిల్లిపెసర 25 క్వింటాళ్లు, జనుము 6 క్వింటాళ్లు అందుబాటులోకి రాగా 60 శాతం పంపిణీ చేశాం. మిగిలినవి ఆయా రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–బి. అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

గుడివాడలో ఫ్యాన్ హవా

- నిరుపేదలంతా వైఎస్సార్ సీపీ వైపే
- ఓటు లేని ఎన్‌ఆర్‌ఐలు టీడీపీ వైపు
- ఐదో సారి కొడాలి నాని గెలుపు ఖాయమంటున్న పేదలు



ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ రూరల్: గుడివాడ నియోజకవర్గంలో ఫ్యాన్ మరోసారి ప్రభంజనం సృష్టించనుంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుపు బాట పట్టనున్నారని నియోజకవర్గంగా ఉన్న నిరుపేదల్లో ఇదే మాట వినపడుతోంది. వైఎస్సార్ సీపీకి అడ్డాగా ఉన్న గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొడాలి నాని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి రావడం ఈ ఐదేళ్లుగా గుడివాడ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. టిడ్కో ఇళ్ల నిర్మాణం, బస్టాండ్ అభివృద్ధి, పేదలకు వైద్యం అందేలా 100 పడకల ఆస్పత్రి, శతాబ్ద కాలంగా గుడివాడ ప్రజలు ఎదురుచూస్తున్న భీమవరం, పామర్రు రైల్వే గేట్ల పై ఓవర్ల నిర్మాణాలు, గుడివాడ–కంకిపాడు రోడ్ నిర్మాణంతో పాటు జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున పైప్‌లైన్‌లు, ఇంటింటికీ కుళాయిల నిర్మాణం, గుడివాడ–తమిరిశ జీపీకే రోడ్ అభివృద్ధి, జనార్దనపురం–కుదరవల్లి, కుదరవల్లిచెట్లు–కాళింగపేట రోడ్ల నిర్మాణాల పేరిట పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 కాలంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి జరిగిన మాట శూన్యం. పట్టణాభివృద్ధిని గాలికి వదిలేసిన మాట వాస్తవం. నియోజకవర్గంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి లేదనేది నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం.

పచ్చనేతలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం

గుడివాడ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణను చూడలేక పచ్చనేతలు, పసుపు మీడియా కొంతకాలంగా విషాన్ని చిమ్ముతున్నారు. కొడాలి నానికి గ్రామాల్లో ఉన్న ఆదరణను తట్టుకోలేక ఈ ఎన్నికల్లో నానిని ఓడించేందుకు రాష్ట్ర, దేశ, విదేశ స్థాయిలో పచ్చమూకలు మూకుమ్మడిగా కొంతకాలంగా వైఎస్సార్ సీపీపై అసత్య ప్రచారానికి తెరలేపారు. ఆర్థికంగా బలంగా ఉన్న పచ్చమూకలు, స్థానికంగా ఉన్న నేతలు పోటీ చేసే దమ్ము లేక, ఆర్థికంగా ఉన్న ఎన్‌ఆర్‌ఐను నియోజకవర్గంలో రంగంలోకి దింపారు.

పచ్చమూకను తిప్పి కొట్టిన ప్రజలు

గుడివాడ నియోజకవర్గంలో గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్న టీడీపీకి ఓటర్లు ఓటు రూపంలో గట్టి బుద్ధి చెప్పారనే మాటలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఈ ఐదేళ్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందడంతో ప్రజలు సీఎం జగన్‌కు మద్దతుగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన మాట వాస్తవమేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వెనుకబడిన, పేద, బడుగు, బలహీన, ముస్లీం మైనార్టీ ఓటర్లు వైఎస్సార్ సీపీవైపు మొగ్గు చూపారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలన ఎక్కువగా లబ్ధిపొందిన మహిళలు ఓటు వేసేందుకు అధికంగా రావడం ఈ విశ్లేషణకు అర్థం పడుతుందని నిపుణుల అభిప్రాయం.

గుడివాడలో దుష్ప్రచారం

గుడివాడ నియోజకవర్గం గత రెండు దఫాలుగా వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉంది. ముఖ్యంగా ఎమ్మెల్యే కొడాలి నాని వ్యక్తిగత హవాతో పాటు గత ఐదేళ్లలో సీఎం జగనన్న పాలన చరిష్మా ప్రజలను ఆకట్టుకుంది. గుడివాడలో అత్యధికంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ వర్గాల ఓట్లు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కువగా ఈ వర్గాలు లబ్ధి పొందాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈ వర్గాలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపాయనేది ప్రజల అభిప్రాయం. వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూడలేని పచ్చమూకలు పందేల పేరిట నియోజకవర్గంలో దుష్ప్రచారం మొదలు పెట్టారు. ఓటు లేని ఎన్‌ఆర్‌ఐలు, ఆర్థికంగా బలంగా ఉన్న చంద్రబాబు సామాజికవర్గం నేతలు కొందరు పందేలతో ప్రజలను రెచ్చగొడుతున్నారు. వైఎస్సార్ సీపీ వైపు ఉన్న వర్గాలు రెక్కాడితే డొక్కాడని వర్గాలు. వారిని పందేల పేరిట కవ్విస్తున్నారు. వాస్తవానికి వైఎస్సార్ సీపీకి అండదండలుగా ఉన్న వారంతా నిరుపేదలు. పందేలు కాసే సత్తా లేనివారు. ఇది ఆసరాగా తీసుకుని గుడివాడలో పచ్చమూకలు పందేలు కాయడం లేదని, ఎమ్మెల్యే కొడాలి నాని ఓటమి ఖాయమంటూ ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి గుడివాడ నియోజకవర్గంలో ఉన్న ప్రజలు ఎమ్మెల్యే కొడాలి నానికి అండగా ఓటు వేశామని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఈ అగ్రవర్ణాలు, పచ్చమూకలు, ఎన్‌ఆర్‌ఐలు ఇక్కడి నుంచి పారిపోవడం ఖాయమంటూ పేదలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనంతో పెంపొందనున్న ఆలోచనాశక్తి



జమీగొల్వేపల్లిలో సుమతీ, వేమన శతక పద్యాలను పఠిస్తున్న విద్యార్థులు



మండవల్లి గ్రంథాలయంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు



పమిడిముక్కల గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): పుస్తకాలు, పద్యాలను చదవడం వలన విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత పెంపొందుతుందని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, ఉపాధ్యాయుడు దీవి వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం వేమన, సుమతి శతక పద్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన, సుమతి శతక పద్యాలలోని నీతిని, భావాన్ని గ్రహించడం ద్వారా ఉత్తమ విద్యార్థులుగా , ఉత్తమపౌరులుగా రూపొందుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి. నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో ..

వాతావరణంలో కాలుష్యనివారణకు ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని పామర్రు ద్వితీయశ్రేణి గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం మొక్కలను నాటారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పుస్తకసమీక్ష, నీతి కథలు చదివించారు. అనంతరం చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి వీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథపాలకులు సాలార్ షరీఫ్ పర్యవేక్షించారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షరీఫ్ కోరారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులతో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పిల్లలతో కథల పుస్తకాలు చదివింపచేసి వాటి సారాంశాన్ని వివరించారు. వేసవి శిబిరంలో చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి అంశాలను నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరాలు కొనసాగుతాయన్నారు.



పామర్రు గ్రంథాలయంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయంలో పుస్తకాలను ఎంచుకుంటున్న విద్యార్థులు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

కలిదిండి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని కోరుకొల్లు గ్రంథాలయ అధికారి రాఘవులు అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం 'పుస్తకాలు, వాటి లాభాలు' అనే అంశంపై గ్రంథాలయాధికారి విద్యార్థులకు వివరించారు. రాఘవులు మాట్లాడుతూ పిల్లలు తమకు నచ్చిన పుస్తకాలను ఎంచుకుని అందులోని కథలను చదివి వాటి సారాంశాన్ని తెలుసుకున్నారని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ ఏడో తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయని ఎంపీడీఓ ఎన్.నవీన్ అన్నారు. మండలంలోని లింగాలలో రూ.68 వేల ఉపాధి నిధుల వ్యయంతో 64 మంది కూలీలతో పంట కాలువ అభివృద్ధి పనులను సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందన్నారు. పంటకాలువల మరమ్మతులు చేపట్టడం వల్ల కూలీలకు ఉపాధి పనులు దొరుకుతున్నాయన్నారు.

ఉపాధి హామీలో పంట కాలువ మరమ్మతులు

పెదపారుపూడి: మండలంలోని 19 గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు ఏపీఓ స్ఫూర్తి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, ఈదులమద్దాలి, మోపర్రు, దోసపాడు, వానపాముల, పాములపాడు తదితర గ్రామాల్లో పంట బోదెల్లో తవ్వకం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.



లింగాలలో పంట కాలువ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

4,031 మందికి ఉపాధి

మొవ్వ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సోమవారం మొవ్వ మండలంలో 4,031 మందికి సోమవారం ఉపాధి కల్పించినట్లు ఏపీఓ కే లక్ష్మీ రెడ్డి తెలిపారు. మండలంలోని 21 గ్రామాల్లో 158 పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రమాబాయికి ఘన నివాళి



మండవల్లి: అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా తీర్చిదిద్దిన ఘనత ఆయన సతీమణి రమాబాయికే దక్కుతుందని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, మెండా సురేష్ అన్నారు. అంబేడ్కర్ సతీమణి రామాబాయి వర్ధంతిని, అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలోని మహిళలు రమాబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యవర్గ సభ్యులు గోరింక గాంధీ, కె.రవివరప్రసాద్, డి.వినోద్‌కుమార్, పి.రత్నరాజు, జి.రమేష్, జె.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తోట్లవల్లూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్‌బాబు హెచ్చరించారు. స్థానిక గౌడ కల్యాణ మండపంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి గొడవలు, అల్లర్లకు ఆస్కారం లేకుండా కార్యకర్తలను నాయకులు అదుపులో ఉంచుకోవాలని సీఐ కిషోర్‌బాబు సూచించారు. జూన్ నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలకు, డీజేలకు, బాణసంచా కాల్చేందుకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. ఎవరూ బహిరంగంగా కానీ సోషల్‌మీడియా వేదికగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున అకారణంగా గొడవలకు దిగి కేసులలో ఇరుక్కోవద్దన్నారు. తోట్లవల్లూరు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ విశ్వనాథ్

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

పామర్రు: సేంద్రియ పద్ధతుల వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వలో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల నిల్లలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్య అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. పామర్రు మండలంలోని 25 గ్రామాల్లో సుమారు 23,500 ఎకరాల్లో వ్యవసాయ పనులు చేస్తున్నారు. రైతులు తమ పొలాల్లోని ఎత్తుపల్లాలను చదును చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. తమ పొలాలను ట్రాక్టర్ల సాయంతో దున్నుతున్నారు. ఇలా చేయడం వల్ల నేలలో పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో తెగుళ్ల దూరం

పంటలో కాండం తొలుచు పురుగులు, ఆకుముడత పురుగులు, కాండం కుళ్లు తెగులకు కారణాలైన పురుగులు, గుడ్లు పొదిగి నేలల్లో ఉంచడం వల్ల అనంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంట నాశనం చేస్తాయని రైతులు చెబుతున్నారు. వేసవి దుక్కులు దున్నడం వల్ల ఆ తెగులు జాతికి చెందిన బీజాలు వేడికి చనిపోవడం లేదా పక్షులు తినడంతో పంట తెగులువ్యాప్తి తక్కువగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.



పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

వేసవి దుక్కులతో రైతన్నకు మేలు



వేసవి దుక్కులుదున్నడం వలన పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. గత పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల కూడా సారవంతమవుతుంది. అంతే కాకుండా సాగు చేసే పంటకు కలుపు, చీడ పీడ బెడద తగ్గుతుంది. పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు.

– శివనాగరాణి, వ్యవసాయాధికారి, పామర్రు మండలం

230 మందికి ఉచిత హోమియో వైద్యం

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రం ఆవరణలోని హోమియో సెంటర్‌లో శిబిరం ఏర్పాటు చేయగా హోమియో వైద్యులు 230 మందికి వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మందులు ఉచితంగా అందించారు.

మంచి చేశాం.. ప్రజలు ఆశీర్వదిస్తారు



పార్టీ కార్యాలయంలో నాయకులతో పోలింగ్ సరళిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గ ప్రజలకు పార్టీలు చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించాం.. మరో పర్యాయం ప్రజలు ఆశీర్వదిస్తారనే పూర్తి నమ్మకం ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఇటీవల జరిగిన పోలింగ్ సరళిని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం చర్చించారు. అందరి అభిప్రాయాలను తీసుకున్నారు. పోలింగ్ సందర్భంగా పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. రాష్ట్ర చరిత్రలో ప్రజల సంక్షేమం కోసం ఇంతగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన పార్టీ మరోటి లేదన్నారు. నవరత్న పథకాలు అర్హతే ప్రామాణికంగా సాగాయన్నారు. కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా ఉండాలని కోరారు. కౌంటింగ్ రోజున విధులు నిర్వహించే వైఎస్సార్ సీపీ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.01 లక్షల విరాళం



నగదును కమిటీ సభ్యులకు అందిస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

కోడూరు: కోడూరులో నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి పూతబోయిన శ్రీనివాసరావు– లక్ష్మీ కుమారి, నాగనరసింహారావు– దాక్షాయణి, నాగమణికంత– వాణి దంపతులు రూ.1,01,116 నగదును విరాళంగా అందించారు. సోమవారం ఈ నగదును కమిటీ సభ్యులకు ఇచ్చారు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ క్షేత్రానికి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని దాతలు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం రవిభాస్కర్, ఉల్లి రంగారావు, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.